క్లుప్తంగా

నేడు వలంటీర్లకు సన్మానం

మోపిదేవి: ప్రభుత్వం వలంటీర్ల సేవలను గుర్తించి వారికి నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలను ఏటా వలంటీర్లకు అందిస్తున్నట్లు ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు తెలిపారు. అందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అవార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. మండలంలో సేవా రత్న 5, సేవా మిత్రలు 208 మంది వలంటీర్లకు నగదు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు వివరించారు.

సేవావజ్ర ఒకరు.. సేవారత్న ఐదుగురు

పెడన: మండలంలో సేవా వజ్ర ఒకరికి, సేవా రత్న ఐదుగురికి, సేవా మిత్ర 209 మందికి ఇవ్వనున్నారని పెడన ఎంపీడీవో వి.రెడ్డయ్య తెలిపారు. సేవావజ్రకు బల్లిపర్రు సచివాలయానికి చెందిన పరింకాల శివ, సేవారత్నలకు ఇదే సచివాలయానికి చెందిన సమ్మెట మాధవి, చోడవరం సచివాలయానికి చెందిన బిరుదుగడ్డ నాగమణి, కాకర్లమూడి సచివాలయం పరిధిలో బి.వీరబాబు, కమలాపురం సచివాలయం పరిధిలో రాజులపాటి భవాని, కొంకేపూడి సచివాలయం పరిధిలో శలపాటి అమల సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారని తెలిపారు. వీరికి త్వరలోనే నగదు బహుమతులతో పాటు పురస్కారాలను అందజేయనున్నట్లు రెడ్డయ్య తెలిపారు.

చల్లపల్లి: మండలంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం బుధవారం ఉదయం చల్లపల్లిలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఎస్.నాగలక్ష్మి తెలిపారు.

ఆక్వా రైతులకు అవగాహన సదస్సు



కోడూరు: ఆక్వా సాగులో అనుసరించాల్సిన మెలకువలపై మత్స్యశాఖ అధికారులు రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని పిట్టల్లంకలో మంగళవారం ఆక్వా మత్స్య సాగుబడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన బావిశెట్టి పులేంద్రరావు రొయ్యల చెరువుల వద్ద ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ నీటి పరీక్షల్లో నాణ్యతా ప్రమాణాలు, పీహెచ్, సెల్నిటీ, ఆల్కలనిటీ, హార్డినెస్, అమ్మోనియా నైట్రేట్‌ల పరీక్షలను చేసి చూపించారు. వీఎఫ్ఏలు షేక్ మదరసా, ల్యాబ్ టెక్నీషియన్ హేమలత, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ బిడ్డలు.. జగనన్న ఆత్మబంధువులు

వలంటీర్ల సేవా పురస్కారాల సభలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రేమాలవారిపాలెం(నాగాయలంక): వలంటీర్లు ప్రతి ఇంటికీ బిడ్డలని.. జగనన్న ఆత్మబంధువులని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక నాగాయలంక మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం వలంటీర్ల సేవా పురస్కారాల సభ జరిగింది. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రానికి ఏమీ చేయని చంద్రబాబు, నియోజకవర్గంలో ప్రజలకు దూరంగా ఉండే మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చర్చలకు రావాలని కోరడం కంటే హాస్యాస్పదమైన సంఘటన రాజకీయ చరిత్రలో ఏదీ ఉండదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ రైతువిభాగం కృష్ణా,గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ రాజకీయాల్లో గౌరవప్రదంగా నడిచే విధంగా పార్టీ నాయకులు, శ్రేణులను నిలబెట్టిన ఘనత దేశంలో జగన్నకు మాత్రమే సాధ్యమైందని కొనియాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక మాజీ ఉపసభాపతి బుద్ధప్రసాద్ తప్పుడు ప్రచారం, కపట ఆరోపణలతో ప్రజల సంక్షేమాన్ని అడ్డుకుంటున్నారని విమర్శించారు.

మండలంలోని నంగేగడ్డ సచివాలయం పరిధిలోని వలంటీరు దోనె సంధ్యారాణి ఈ ఏడాది సేవా వజ్ర అవార్డు దక్కించుకున్నారు. రేమాల శిరీష(రేమాలవారిపాలెం), బుడిపల్లి గంగాభవాని (పర్రచివర), వంకా లక్ష్మీతిరుపతమ్మ(నంగేగడ్డ), వల్లభనేని రామయ్య (గుల్లలమోద), తండు అరుణ(మర్రిపాలెం) సేవారత్న పురస్కారాలను, అన్ని సచివాలయాల పరిధిలోని 281మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారం ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు చేతులమీదుగా ప్రదానం చేశారు. ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో డీఎంసీఎస్ డైరక్టర్ రేమాల సుబ్బారావు(బెనర్జీ), దివిమార్కెట్ కమిటీ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ డైరక్టర్ మద్ది వెంకటనారాయణ (చిన్నారి), పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, వైఎస్ఎంపీపీలు పరిశె అమ్మన్న, చాట్రగడ్డ బాబూరావు, సర్పంచ్‌లు అంబటి శ్యామ్‌ప్రసాద్, చోడిశెట్టి బుజ్జిమ్మ, ఎంపీటీసీ సభ్యులు పుట్టి స్వరూపరాణి, మెకా నాగప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షులు తోట సాయిబాబు, ఎంపీ సాంబశివరావు(చంటి), నేతలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



కోడూరులో సేవా వజ్ర అవార్డును అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



సేవా వజ్ర అవార్డు గ్రహీతను సన్మానించిన ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

వలంటీర్లు సంక్షేమ వారధులు

కోడూరు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా చేస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద మండలస్థాయి వలంటీర్ల సేవలకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రమేష్‌బాబు ప్రసంగించారు. వలంటీర్‌ను ప్రజలు తమ కుటుంబసభ్యుడిగా భావించడాన్ని స్వయంగా చూశానని, ఇదే స్ఫూర్తితో పని చేయాలని కోరారు.

● మండలంలోని కోడూరు-1, లింగారెడ్డిపాలెం సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న బొర్రా రాము, జరుగు శ్రీవల్లికి సేవా వజ్ర అవార్డు లభించగా, వీటిని రమేష్‌బాబు వలంటీర్లకు అందించి, శాలువా కప్పి సత్కరించారు. సేవా రత్న అవార్డులు పొందిన వడుగు దుర్గాభవాని (ఉల్లిపాలెం), పరిసే రజిని (కోడూరు-1), దాసరి తిరుపతమ్మ (లింగారెడ్డిపాలెం), అప్పికట్ల ఆదిశేషు (వి.కొత్తపాలెం), చిలకలపూడి అరుణ (సాలెంపాలెం)లను కూడా సత్కరించి, అవార్డులను అందించారు. వీరితో పాటు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 260మంది వలంటీర్లకు సేవా మిత్రా అవార్డులు లభించాయి. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, సర్పంచి వెన్నా షైనీ, పార్టీ జిల్లా రైతు విభాగ కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

రూ. 1.90 కోట్లతో ప్రహరీ



ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో పేర్ని, నాని తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాజాబాబు అన్నారు. రూ. 1.9 కోట్ల ఎంయూడీఏ నిధుల ద్వారా జరగనున్న కలెక్టరేట్ ప్రహరీ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. కలెక్టర్ రాజాబాబు, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ఆవరణకు ప్రహరీ నిర్మించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నామని వర్షాలకు ఆవరణలో పల్లం ప్రాంతాల్లో నీరు నిలిచి భవనాలు దెబ్బతింటున్నాయన్నారు. ఎంయూడీఏ నిధుల ద్వారా రూ. 1.90 కోట్లతో ఈ ప్రహరీ నిర్మాణానికి నిధులను ఇచ్చారని ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే పేర్ని నాని కి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు తాగు నీరు, టాయిలెట్స్, కనీస వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశాల నిర్వహణకు రూ. 5 కోట్ల డీఆర్డీఏ నిధులతో కలెక్టరేట్ ఆవరణలో మీటింగ్ హాలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. వీటితో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు, సుందరీకరణకు డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్ నిధుల నుంచి ఎమ్మెల్యేల సహకారంతో రూ. 4 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ కలెక్టర్‌గా రాజాబాబు వచ్చిన తరువాత కార్యాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా అభివృద్ధి పనులకు నిధుల విషయంలో చర్చించారన్నారు. గతంలో ఏఎస్ రెడ్డి కలెక్టర్‌గా పనిచేసి తనదైన ముద్ర వేసుకున్నారని అదే రీతిలో కలెక్టర్ రాజాబాబు కలెక్టరేట్ ను అభివృద్ధి, సుందరీకరణ చేసి మచిలీపట్నం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోతారన్నారు. కార్యక్రమంలో ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా నాగ దుర్గాభవాని, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, ఆర్డీవో ఎం వాణి, ఆర్‌అండ్‌బీ ఎఈ ఎ శ్రీనివాసరావు, కార్పొరేటర్ పర్ణం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జి పేర్ని కిట్టు



మూడో డివిజన్‌లో పనులు ప్రారంభిస్తున్న కిట్టు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలోని యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 13, 26 డివిజన్లలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గాభవానితో కలిసి పనులు ప్రారంభించారు. 13వ డివిజన్‌లో ఎంయూడీఏ నిధులు రూ. 29 లక్షలు, 26వ డివిజన్‌లో రూ. 15.30 లక్షలతో సిమెంటు రోడ్డు, రూ. 4 లక్షలతో పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులు టెంకాయకొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో బందరుపోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఇవి పూర్తయితే బందరుకు చెందిన యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన యువతకు కూడా పోర్టులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తనను ఇన్‌చార్జ్‌గా నియమించిన అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు రూ. 20 కోట్లు ప్రత్యేకంగా మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో కూడా సిమెంటు రోడ్లు, పక్కా డ్రెయిన్లు తదితర మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. గడపగడపకు నిధులతో మిగిలిన పలు అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, 13వ డివిజన్ కార్పొరేటర్ గాజుల శ్రీదేవి, 13, 26 డివిజన్ల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు గాజుల భగవాన్, మాడపాటి వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ఎండీ సదురుద్దీన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ ఫలాలు

వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక



కాకర్లమూడిలో ఉప్పాల రాము

పెడన: పేదలకు సంక్షేమ ఫలాలు అందాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని, అందుకు మీరంతా మద్దతు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. మంగళవారం పెడన మండలం కాకర్లమూడి గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులు గ్రామంలో ప్రజాదీవెన నిర్వహించారు. దీనిలో భాగంగా విస్తృతంగా పర్యటించి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇద్దరు గ్రామస్తులను కలిసి ఈ నాలుగున్నర ఏళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించిన సంక్షేమ ప్రగతిని, టీడీపీ ప్రభుత్వ హయాంలో తేడా గుర్తించాలని చెబుతూ ముందుకు సాగారు. ప్రతి ఒక్కరు ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుని నవరత్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో వృద్ధాప్య, వితంతు పింఛన్లు పొందడానికి, ఇప్పటి ప్రభుత్వ విధానానికి తేడా గమనించాలని కోరారు. కార్యక్రమంలో పెడన ఏఎంసీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ పెడన మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, పార్టీ నాయకులు రాజులపాటి అచ్చుతరావు, గరికపాటి వెంకట రామానాయుడు, తాతా ఉమామహేశ్వరరావు, పరసా రాజేష్, దావు భైరవలింగం, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ



కృత్తివెన్ను: మహిళల ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడేలా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో కార్యాలయ ఏవో మధుసూదనరావు అన్నారు. జిల్లా ప్రజాపరిషత్ వారి ఆధ్వర్యంలో మహిళా సాధికారతలో భాగంగా కృత్తివెన్నులో టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయంలో నెలరోజుల పాటు ఎంపిక చేసిన మహిళలకు తరగతులు నిర్వహించనున్నట్లు శిక్షకురాలు మంగతాయారు వివరించారు. మండలంలో 35 మంది మహిళలు మొదటి విడతలో శిక్షణ పొందుతారన్నారు. కార్యక్రమంలో మండల ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెడన: కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు 50 శాతం రాయితీతో కుట్టు మిషన్లను జెడ్పీ అందించనున్నట్లు పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళలకు కుట్టుపై శిక్షణ తరగతులను ఎంపీపీ ప్రారంభించారు.

పరామర్శ



మోపిదేవి: మోపిదేవి గొల్లపాలెంలో వైఎస్సార్ సీపీ గ్రామకన్వీనర్ కారుమూరి తాతయ్య సోదరుడు కారుమూరి శ్రీనివాసరావు(46) గుండెపోటుతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మోపిదేవిలో వారి ఇంటికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ కారుమూరి శివనాగరాజు, మండల ఎస్సీసెల్ కన్వీనర్ బోడాబత్తిన పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జన ఔషధి కేంద్రం ప్రారంభం

చల్లపల్లి: పేదలకు, రైతులకు, వ్యవసాయ కార్మికులకు తక్కువ ధరకే మెడిసిన్స్ అందించడానికి చల్లపల్లి పీఏసీఎస్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన జన ఔషధి కేంద్రాన్ని బుధవారం ఉదయం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభిస్తారని పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి) తెలిపారు. ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం, ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా చేపట్టిన కార్యక్రమం ద్వారా జనరిక్ మందుల దుకాణం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి



స్వామివార్ల కథలను వివరిస్తున్న టీటీడీ వేదపాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్య అవధాని

కోడూరు: హంసలదీవి గ్రామం ఆధ్యాత్మిక శోభతో పులకించింది. భీష్మా ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని విశ్వశాంతి యాగ మహోత్సవ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన రమాసహిత సత్యదేవుని వ్రతాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో టీటీడీ వేదపాఠశాలకు చెందిన పండితుల మంత్రవచనాల నడుమ జరిగిన సత్యదేవుని వ్రతాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 600మంది దంపతులు ఈ వ్రతాల్లో పాల్గొని తమ భక్తిభావం చాటుకున్నారు. టీటీడీ వేదపాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని సత్యదేవునికి సంబంధించిన ఐదు కథలను భక్తులకు వివరించారు. వ్రతాల్లో పాల్గొన్న దంపతులకు స్వామివారి చిత్రపటాలను అందించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో సుమారు నాలుగు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

● అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామివారికి భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా సామూహిక సత్యవ్రతాలు

పెడన: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం పలు వైష్ణవాలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గుడివాడ రోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పరాశరం కృష్ణప్రసాద్, అగ్నిహోత్రం హరికృష్ణల దంపతులు వ్రతాలను జరిపించారు. దేవదాయశాఖ, ఆలయ అభివృద్ధి కమిటీలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తోటమూలలోని శ్రీపద్మావతి అలివేలుమంగా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 20వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని మొదటి రోజు భీష్మ ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.. మార్చి 2వ తేదీ వరకు వివిధ పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు గౌరీపతిరావు తెలిపారు.

వైభవంగా ప్రత్యేక పూజలు

నాగాయలంక: స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో ఆర్య వైశ్యసంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం భీష్మ ఏకాదశి ఘనంగా చేశారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీదాసాంజనేయస్వామి సన్నిధిలో కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఆకుతోట వెంకట సీతారామయ్య, శిరీష దంపతులు పీటలపై కూర్చున్నారు. స్వామివారిని గారెలు, తమలపాకుల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గుంటూరు జిల్లా అనంతవరానికి చెందిన కుప్పా వంశీయులు 105 సంవత్సరాల నుంచి మాఘమాసంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారి మూలమూర్తికి పంచామృతాలతో అభిషేకాలను చేశారు. టీటీడీ వేదపాఠశాల ప్రిన్సిపాల్, ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు జరిగాయి.

ఓటరు దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

గూడూరు: ఓటరు దరఖాస్తుల విషయంలో అలసత్వం చూపవద్దని గూడూరు తహసీల్దార్ ఎస్.ఎస్.శాంతి బీఎల్వోలను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ముడా స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ పద్మావతితో కలిసి బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు నమోదుకు వచ్చే దరఖాస్తులతో పాటుగా మృతి చెందిన వారి ఓట్ల తొలగింపు, ఓటరు జాబితాలో తప్పుల సవరణ, చిరునామా మార్పు విషయంలో ఎప్పటికప్పుడు విచారణ చేయాలని ఆమె ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం కల్పిస్తుండటంతో అలాంటి వారిని గుర్తించాలని ఆమె సూచించారు. అనంతరం కప్పలదొడ్డి, ఆకులమన్నాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ నస్రీన్ ఆరా, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

గొడవ వద్దన్నందుకు దాడి

నాగాయలంక: గ్రామంలోని ఏడో వార్డు రామాలయం సెంటర్‌లో పానీపూరీ బండి వద్ద జరిగిన గొడవ ఘటనపై కేసు నమోదు చేసినట్లు నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం మంగళవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 19వ తేదీ రాత్రి రామాలయం సెంటర్‌లో బండి వద్ద నడకుదుటి లక్ష్మీనరసింహ పానీపూరీ తిని డబ్బులు కట్టే విషయంలో వ్యాపారితో ఘర్షణ పడ్డాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న నాగిడి నాగరాజు బండి వద్దకు వెళ్లి గొడవ ఎందుకు డబ్బులు ఇచ్చేయక అంటూ సర్ది చెప్పడంతో నవ్వు ఎవడివి నాకు చెప్పడానికి అంటూ గొడవకు దిగిన లక్ష్మీనరసింహ కర్రతో నాగరాజును కొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. నాగరాజును అవనిగడ్డ కమ్యూనిటీ ఆసుపత్రి తీసుకెళ్లారు. ఆసుపత్రి వర్గాల నుంచి వచ్చిన సమాచారంపై మంగళవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

జీవనోపాధి కోల్పోతున్నామంటూ మత్స్యకారుల ఫిర్యాదు

కోడూరు: కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తులు బాంబులు వేసి చేపలను చంపుతున్నారని విశ్వనాథపల్లికి చెందిన మత్స్యకారులు మంగళవారం కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శిరీష తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

పామర్రు: ఆల్ ఇండియా ఓపెన్‌కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ఏఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్లో విజేతలను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన మచిలీపట్నంలోని పోలీస్ ఫంక్షన్ ప్లాజాలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. అండర్-12, అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో డి.భవన శ్రీజ, కె స్ఫూర్తి, పి.శ్రావ్యశ్రీ ప్రథమ స్థానంలో గెలుపొంది బంగారు ట్రోఫీని ప్రశంసా పత్రాన్ని సాధించారన్నారు. ద్వితీయ స్థానంలో ముగ్గురు విజేతలై వెండి ట్రోఫీ, ప్రశంసా పత్రాన్ని పొందారు. కోచ్ వీవీ ఎస్ రామకృష్ణను ప్రిన్సిపాల్ అభినందించారు.

రేపు ఉరుసు మహోత్సవం

పామర్రు: స్థానిక హజరత్ జియావుల్ హఖీలీమ అల్లా మొహిబుల్లా షా చిష్టి బాబా 80వ ఉరుసు మహోత్సవం ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎండీ ఆసీఫ్‌ఖాన్, ఎండీ అఫ్‌ద్ అలీ ఖాన్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ ఉరుసు మహోత్సవంలో రాష్ట్రం నలుమూలల నుంచి అనేక మంది భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు. వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని ఆ రోజు సాయంత్రం చందనం ఊరేగింపు అనంతరం దర్గాలో ప్రత్యేక పూజలు, ఖవాలీ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చిన భక్తులందరికీ అన్న సమారాధన ఉంటుందని తెలిపారు.

రామన్నపేటలో సామాజిక తనిఖీ

గూడూరు: ఉపాధి హామీ పథకంలో భాగంగా రామన్నపేట పంచాయతీలో జరిగిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామసభకు అధ్యక్షత వహించిన సర్పంచి మురాల మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా ఈ ఏడాది చేపట్టిన చెరువు పూడికతీత పనుల కారణంగా వేసవిలో పశువులకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్ ఆధ్వర్యాన సామాజిక తనిఖీల్లో జిల్లా రిసోర్స్ పర్సన్ పూర్ణ బాబు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 28వ డివిజన్‌లో మంగళవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నూతన కార్డులను వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్ సాహెబ్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

మంగళాపురం(చల్లపల్లి): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ స్థాయి పరిపాలనా భవనాల నిర్మాణాలు తమ గ్రామంలో పూర్తి చేసినట్లు మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అర్హులకు నివేశనా స్థలాలు



పట్టాలను అందజేస్తున్న పేర్ని కిట్టు చిత్రంలో మేయర్, డెప్యూటీ మేయర్లు

మచిలీపట్నం టౌన్: నగరంలో అర్హులకు నివేశనా స్థలాలు అందిస్తామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక 36వ డివిజన్ ఆంధ్రజాతీయ కళాశాల ప్రాంతంలో గత 35 సంవత్సరాలుగా గృహాలు నిర్మించుకుని ఉంటున్న 45 మందికి పట్టాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, కో-ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి తదితరులు పాల్గొన్నారు.